వికసించిన పల్లె

- నాయుడుపాలెంలో ప్రగతి పరుగు
- మౌలిక వసతులతో మారిన రూపురేఖలు
- అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం

ఇది కదా అభివృద్ధి



రాముడుగారిదొడ్డిలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం



మెట్టపాలెంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా వెల్‌నెస్ సెంటర్

పరవాడ: నాడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న నాయుడుపాలెం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రగతి బాట పట్టింది. సేవలు గ్రామంలోనే అందుతున్నాయి. పథకాలు ఇంటికే చేరుతున్నాయి. దీంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి



గొల్లపేటలో నిర్మించిన సీసీ రహదారి

నాయుడు పాలెం పంచాయతీలో సుమారు ఐదు వేల మంది జనాభా ఉండగా వీరిలో 3,800 మంది ఓటర్లు ఉన్నారు. పంచాయతీ అనుబంధ గ్రామాలు హస్తినాపురం, బండారుపాలెం, మెట్టపాలెం, పాత రాజానపాలెం, మంగప్పయ్యగారి ఊరు, గొల్లపేట, కోరంగివానిపాలెం, రాముడుగారి దొడ్డి, సిమ్మన్నగారిదొడ్డి, వెంకటపతిపాలెం, తవ్వవానిపాలెం, గంగునాయుడుపాలెం ఉన్నాయి. శివారు గ్రామాల ప్రజలు గతంలో ఏ చిన్న పని కావాలన్నా 11 కిలోమీటర్ల దూరంలో ఉన్న పరవాడ మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వచ్చేది. తీరా అక్కడికి వెళ్లినా పనులు సకాలంలో పూర్తికా పోవడంతో రెండు మూడు పర్యాయాలు తిరగడానికి ప్రజలు ఇబ్బందులు పడే వారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకతో గ్రామంలో రూపురేఖలు ఒక్కసారిగా మారిపోయాయి. దీంతో పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో కొత్త కళ కనిపిస్తోంది.

ప్రజల చెంతకే ఫలాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలను గుర్తించి గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. వైద్య సేవలు అందించడానికి వెల్‌నెస్ సెంటర్‌తో పాటు రైతులకు సేవలందించడానికి ఆర్‌బీకే నిర్మించారు. వీటితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతలకు భరోసా



రాముడుగారిదొడ్డిలో నిర్మించిన సీసీ డ్రైను

- వ్యవసాయ సీజన్ వచ్చిందంటే పంటలకు కావాల్సిన ఎరువులు, విత్తనాల కోసం గతంలో 11 కిలోమీటర్ల దూరంలోని పరవాడ వెళ్లాల్సి వచ్చేది. అటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతన్నలకు కావలసిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందిస్తోంది. సచివాలయ కేంద్రంగా పశువైద్యాధికారి వచ్చి పశు వైద్యం అందిస్తున్నారు.
- తాగునీటి సమస్య పరిష్కరించే దిశగా జల్ జీవన్ మిషన్ పథకంలో హస్తినాపురం, తట్టవానిపాలెం, గంగునాయుడుపాలెం, బండారుపాలెం, రాముడిగారిదొడ్డి గ్రామాల్లో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది.
- కొండవానిపాలెం, రాముడిగారిదొడ్డి, పంచాయతీ కార్యాలయం ప్రాంతాల్లో రూ.33 లక్షల వ్యయంతో సీసీ కాలువల నిర్మాణాలు పూర్తి చేశారు. మరో రూ.25 లక్షల వ్యయంతో నాలుగు గ్రామాల్లో సీసీ కాలువల నిర్మాణం జరుగుతోంది.
- గొల్లపేట, కోరంగివానిపాలెం, మంగప్పయ్యగారి గ్రామాల్లో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు.



నాయుడుపాలెంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం

నాయుడుపాలెం పంచాయతీ జనాభా	దాదాపు 5000 మంది ఓటర్లు- 3,800 మంది
పంచాయతీ పరిధిలోని గ్రామాలు	హస్తినాపురం, బండారుపాలెం, మెట్టపాలెం, పాతరాజానపాలెం, మంగప్పయ్యగారి ఊరు, గొల్లపేట, కోరంగివానిపాలెం, రాముడుగారిదొడ్డి, సిమ్మన్నగారిదొడ్డి, వెంకటపతి పాలెం, తవ్వవానిపాలెం
గ్రామ సచివాలయ భవన నిర్మాణం	రూ.25లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ.22 లక్షలు
వెల్‌నెస్ సెంటర్	రూ.22 లక్షలు
డిజిటల్ లైబ్రరీ	రూ.16 లక్షలు

సౌకర్యాలు కల్పించారు



గ్రామంలో మౌలిక వసతులు కల్పించారు. వైఎస్సార్ చేయూత ద్వారా రూ.18,750 ఆర్థిక సాయం అందుతుంది. రెండేళ్లుగా వచ్చిన ఆర్థిక సాయం పొదుపు చేసిన పాడి గేదె కొనుగోలు చేశాం. పాల అమ్మకం ద్వారా ఆదాయం కుటుంబ అవసరాలకు సరిపోతుంది. వైఎస్సార్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల పేదల జీవితాలు బాగుపడ్డాయి.

– కూండ్రపు సన్యాసమ్మ, మంగప్పయ్యగారివూరు.

చెంతనే సేవలు



జగనన్న పాలనలో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ఇంటికి చేరువలోనే అవసరమైన ప్రభుత్వ సేవలు పొందుతున్నాం. జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు అవసరమైన తాగునీరు, రహదారులు, కాలువలు నిర్మించారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ఈ ప్రభుత్వంలో సర్పంచ్‌గా పనిచేస్తున్నందుకు గర్వంగా ఉంది.

– కూండ్రపు వరలక్ష్మి, సర్పంచ్, నాయుడుపాలెం

బాధలు తప్పాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం వల్ల అనేక ప్రయోజనాలు పొందుతున్నాం. ఏ పని కావాలన్నా సచివాలయాన్ని సంప్రదిస్తే సరిపోతుంది. వలంటీర్ల వ్యవస్థతో మరింత సౌకర్యంగా ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. చాలా సంతోషంగా ఉంది.

– చుక్క నాయుడుబాబు, మెట్టపాలెం

క్లుప్తంగా

500 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



విద్యార్థి కంటి చూపును పరీక్షిస్తున్న దృశ్యం

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. మ్యాక్సీ విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగాచుక్కల మందులు అందించారు. అవసరమైన వారికి త్వరలో కళ్లద్దాలు ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్, ఆసుపత్రి సిబ్బంది సునీత, వెంకట్, రుషిక, అధ్యాపకులు వి.వి నారాయణరెడ్డి, కె.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ విజేతలకు సత్కారం



కె.ఆర్.బాబు, గోవింద్‌ను సత్కరిస్తున్న డిపో మేనేజర్ రాజశేఖర్, అధికారులు

సింహాచలం: తిరుపతిలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో బంగారు పతకాలు సాధించిన సింహాచలం ఆర్టీసీ డిపో ఉద్యోగులను శుక్రవారం డిపో మేనేజర్ రాజశేఖర్ సత్కరించారు. కండక్టర్ కె.ఆర్.బాబు 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 400 మీటర్ల రిలే లో గోల్డ్‌మెడల్స్, అలాగే డ్రైవర్ బి.గోవింద్ 400 మీటర్ల రిలేలో గోల్డ్ మెడల్ సాధించారని చెప్పారు. వీరిని సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డిపో మేనేజర్ దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సాయితులసి, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

చెస్ పోటీల విజేత దివ్యకీర్తికి అభినందన



చెస్‌లో ప్రథమస్థానంలో నిలిచిన దివ్యకీర్తి

పెందుర్తి: నగరంలో జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్, గేమ్స్ రీజనల్ మీట్‌లో పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి చెస్‌లో ప్రతిభ కనబరిచింది. 47 మంది పాల్గొన్న పోటీల్లో దివ్యా కీర్తి ప్రథమ స్థానంలో నిలిచింది. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సిబ్బంది కీర్తిని అభినందించారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్

- 14 కిలోలు స్వాధీనం

సీతమ్మధార: గంజాయి తరలిస్తున్న ఓ యువకుడిని ద్వారకా జోన్ పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కేరళ మలాపురం, వెంగార గ్రామానికి చెందిన పి.ప్రణవ్ అనే యువకుడు ఒడిశా నుంచి గంజాయి తరలిస్తూ ఆశీలమెట్ట జంక్షన్‌లో అనుమానస్పదంగా కనిపించడంతో అదే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ద్వారకా ఎస్ఐ ధర్మేంద్ర అతడిని విచారించా రు. యువకుడి బ్యాగు తనిఖీ చేయగా 14 కిలో ల గంజాయి ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ప్రణవ్ జ్యూస్ షాపులో పనిచేస్తున్నాడు.

ఐఐఏఎంలో 'పినాకిల్-2023' సదస్సు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్(ఐఐఏఎం)లో శుక్రవారం పినాకిల్-2023 సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డబ్ల్యూఎన్ఎస్ సెంటర్ హెడ్(విశాఖపట్నం) ఆర్.ఎల్.నారాయణ మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా మేనేజ్‌మెంట్ విద్యార్థులు లక్ష్యాలు ఏర్పరచుకోవాలన్నారు. ఏకాగ్రత, క్రమశిక్షణతో పాటు విభిన్న అంశాలపై నైపుణ్యం, అవగాహన పెంచుకోవడం ద్వారా మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

45 మందికి కంటి శస్త్ర చికిత్సలు

జగదాంబ : శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 45 మందికి కంటి శస్త్ర చికిత్స నిర్వహించారు. జీవీఎంసీ 39వ వార్డులో ఉన్న స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మూడు దశలుగా శస్త్ర చికిత్సలు జరిగాయి. ఈ మేరకు ఆపరేషన్లు చేయించుకున్న వారందరికీ సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ పండ్లు, రొట్టెలు, తువాళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామారావు తదితరులు



నృత్య ప్రదర్శనలో విద్యార్థులు



మ్యాథ్స్ ఎక్స్‌పోను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ స్వరూప

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు పాల్గొని శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామానుజన్ గణిత శాస్త్రానికి చేసిన సేవలు,గణితంలో ఆయనకు ఉన్న ప్రజ్ఞ పాటవాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు వీవీజీ గోపాలకృష్ణ,డాక్టర్ ఎం రత్నప్రకాష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లెక్కల గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ: ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ జయంతిని మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన గణిత నమూనా నాట్యం, కోణం ఆకారంలో వేసిన శాస్త్రీయ నృత్యం ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల సీఈవో కె.నిశాంత్ మాట్లాడుతూ గణితంలో మెలకువలు తెలుసుకుంటే గణితాన్ని చాలా సులభమంగా నేర్చుకోవచ్చునన్నారు.

పెందుర్తి: గణిత శాస్త్ర పితామహుడు రామానుజాన్ జన్మదినోత్సవం సందర్భంగా సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మ్యాథ్స్ ఎక్స్‌పో ఆలోచింపజేసింది. విద్యార్థులు తమ సృజనాత్మకతతో గణితంపై పలు చార్టులుప్రదర్శించారు. ముందుగా రామానుజన్ చిత్రపటానికి జీఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

సింహగిరిపై వైభవంగా ధనుర్మాస పూజలు

- ముగిసిన పగల్‌పత్తు ఉత్సవాలు
- నేటి నుంచి రాపత్తు ఉత్సవాలు



అప్పన్న ఉత్సవమూర్తులకు బేడా తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు



విశేష అలంకరణలో గోదాదేవి

సింహాచలం: సింహగిరిపై ధనుర్మాస పూజలను ఆరోరోజు శుక్రవారం విశేషంగా నిర్వహించారు. తెల్లవారు జామున 3 గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం పఠించారు. దాదేవికి బేడామండపంలో తిరువీధి వైభవంగా నిర్వహించారు.

ముగిసిన పగల్‌పత్తు ఉత్సవాలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి.అయ్యవారి సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకీ అధిష్ఠింపజేసి ఆలయ బేడామండపంలో వితిరువీధి నిర్వహించారు. దేవస్థానం ట్రస్టీబోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాగా శనివారం నుంచి ఆలయంలో రాపత్తు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. పదిరోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో ప్రతీ రోజూ స్వామి ఒక్కో అలంకారంలో దర్శనమిస్తారు.

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధనుర్మాస పూజలు విశేషంగా నిర్వహించారు. గోదాదేవిని విశేషంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. పాశుర విన్నపం పఠించారు. ఆలయ అర్చకుడు భార్గవ్ తదితరులు ఈ పూజలు నిర్వహించారు.

జిందాల్‌తో ఎంవోయూ రద్దు చేయాలి

- కార్మిక సంఘాల డిమాండ్
- వివిధ విభాగాధిపతులకు వినతులు

ఉక్కునగరం: జిందాల్‌తో జరిగిన ఎంవోయూను రద్దు చేయాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సిటూ ఆధ్వర్యంలో విభాగాధిపతుల కార్యాలయాల వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నూరు శాతం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు 1044 రోజులుగా దీక్షలు చేస్తున్నా.. ఉక్కు యాజమాన్యం ఈవోఐ పేరిట జిందాల్‌తో రూ. 500 కోట్లకు రెండేళ్ల ఒప్పందం చేసుకోవడం దుర్మార్గమన్నారు. దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఆ ఒప్పందాన్ని రద్దు చేసి సెయిల్‌తో ఎంవోయూ చేసుకోవాలని లేదా సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మూడు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వీఆర్ఏల నిరసన

సబ్బవరం: తమ సమస్యలు పరిష్కరించాలని మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు నీటిపల్లి గంగాధరరావు ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ సత్యనారాయణకు అందజేశారు. వీఆర్ఏల జీతాలు పెంచాలని, నామినీగా చేస్తున్న వారికి ఉద్యోగం కల్పించాలని,అర్హులైనవారికి అటెండర్, వీఆర్వోలుగా ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజభాష అమలులో టోలిక్ కృషి అభినందనీయం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఎండీ, డైరెక్టర్ తదితరులు

ఉక్కునగరం: రాజభాష హిందీ అమలుకు టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (టోలిక్) చేస్తున్న కృషి అభినందనీయమని టోలిక్ చైర్మన్, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో 2023-24 మొదటి అర్ధ సంవత్సరంలో రాజభాష అమలులో టోలిక్ కార్యాలయాల పనితీరుపై శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23లో విశాఖపట్నం ఉత్తమ టోలిక్‌గా ఎంపిక కావడం హర్షణీయమన్నారు. సభ్య సంస్థలు సాధించిన పురోగతిని అధికార భాష అమలు డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ బిశ్వాస్ కొనియాడారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ హిందీ ఇన్ హౌస్ మ్యాగజైన్ 'సుగంధ్' తాజా సంచికను ఆవిష్కరించారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి.పాండే, టోలిక్ మెంబర్ సెక్రటరీ లలన్‌కుమార్, ఉక్కు రాజభాష ఏజీఎం టి.హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఖబరిస్థాన్ గోడ కూల్చివేతపై వివాదం

పెందుర్తి: రోడ్డు విస్తరణలో భాగంగా చినముషిడివాడలోని ముస్లిం శ్మశానవాటిక(ఖబరిస్థాన్) గోడను జీవీఎంసీ అధికారులు కూలగొట్టడంపై వివాదం నెలకొంది. దీనిపై ముస్లింలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం స్థానిక ముస్లిం సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఏడాది కిందట రోడ్డు విస్తరణ జరిగితే తాజాగా ఖబరిస్థాన్ గోడను జీవీఎంసీ అధికారులు ఎందుకు కూలగొట్టారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 9వ రోజు శుక్రవారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. టౌన్‌కొత్తరోడ్డు వరకు క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, సర్వదర్శనం, విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి వేళాయె..



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



అభిషేకాలు అందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం 7వ పాశుర విన్నపం జరిగింది. ముందుగా స్వామికి విశేష అభిషేకాలు, అమ్మవారికి మంగళస్నానం చేయించారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు తిరుప్పావై ప్రవచనంలో పాల్గొన్నారు. భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో ప్రసాద వితరణ చేపట్టారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు : శనివారం వైకుంఠ ఏకదశి పూజలు జరుగుతాయని ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు తెలిపారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, గిరి ప్రదక్షిణ ఉంటుందన్నారు. వేకువజాము 3.30 నుంచి స్వామివారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వెంకటాద్రిపై ఈవో నీలిమ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కొండ దిగువ నుంచి భక్తుల కోసం ఉచిత బస్ సదుపాయం కల్పించారు. క్యూలైన్లు, పందిళ్లు, సామియానాలు, తాగునీటి ఏర్పాట్లు చేశారు. ప్రైవేటు వాహనాలకు కొండపైకి అనుమతి లేదు.

నృత్యరూపకం.. అద్భుతం



కూచిపూడి నృత్యరూపకంలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: అర్ధశాంకరం కూచిపూడి నృత్యరూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. శివపార్వతులను సాక్షాత్కరింపజేసేలా అద్వితీయంగా నాట్యం చేసి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో కళాభారతి డ్యాన్స్ ఫెస్టివల్-2023 ప్రారంభమైంది. ఈ వేడుకలను ముఖ్య అతిథిగా స్వామి శ్యాసంవేద్యనంద మహారాజ్ , వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, రాంబాబు, పైడా క్రిష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నాట్య గురువు వాడంటే కిరణ్ శిష్య బృందం ప్రదర్శించిన అర్ధశాంకరం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం కనువిందుగా సాగింది. ఈ కార్యక్రమాన్ని ఎస్ఆర్‌కే ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ అధినేత మంతెన సత్యనారాయణరాజు సౌజన్యంలో ప్రదర్శించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ మూడు రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగుతాయని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.